సాక్షి
చిత్తూరు

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



సాక్షి స్పెల్‌బీకి స్పందన
తిరుపతి విశ్వం పాఠశాలలో ఆదివారం సాక్షి నిర్వహించిన స్పెల్‌బీ పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. - 8లో



వెండి ఆభరణాల కానుక
కాణిపాకంలోని వరదరాజుల స్వామికి 1.8 కిలోల వెండి ఆభరణాలను బెంగళూరుకు చెందిన దాత విరాళం అందించారు. - 8లో



అధికారం అడ్డు పెట్టుకుని..
అధికారాన్ని అడ్డు పెట్టుకుని కూటమి నాయకులు భూములను ఇష్టానుసారంగా ఆక్రమించేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓగా సుధారాణి బాధ్యతలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆదివారం డీఎంహెచ్‌ఓగా సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభావతిదేవి పాడేరు అడిషనల్ డీఎంహెచ్‌ఓగా బదిలీ అయ్యారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన సుధారాణి సీజనల్ వ్యాధుల కట్టడికి తగు చర్యలు తీసుకుంటానన్నారు. పీహెచ్‌సీలను గాడిన పెడతానని, పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తానని ఆమె పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

ఉద్యోగుల సర్దుబాటు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో తిరుపతి ఎస్‌ఈ కార్యాలయం నుంచి 21 మంది ఉద్యోగులను చిత్తూరు ఎస్‌ఈ కార్యాలయానికి సర్దుబాటు చేశారు. ఈ మేరకు సంబంధిత ఆదేశాలను ఎస్‌ఈ సురేంద్రనాయుడు జారీచేశారు. జూనియర్ అకౌంట్ ఆఫీసర్స్ 3, సీనియర్ సహాయకులు 10 మంది, జూనియర్ సహాయకులు 8 మందిని కేటాయించారు. వీరు త్వరలో చిత్తూరులోని ఎస్‌ఈ కార్యాలయంలో బాధ్యతలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించండి



పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పది, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించాలని పాఠశాల విద్య పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పది, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారన్నారు. జిల్లాలో పరీక్షల ఫీజు చెల్లించాల్సిన అభ్యర్థులు 2025 జనవరి 10వ తేదీ లోపు చెల్లించాలని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించే అభ్యర్థులు ఏదైనా ఏపీ ఆన్‌లైన్ కేంద్రం, ఆన్‌లైన్ పేమెంట్ గేట్ వే ద్వారా నేరుగా చెల్లించవచ్చన్నారు. పరీక్ష ఫీజులు చెల్లించిన అభ్యర్థుల వివరాలతో నామినల్ రోల్స్‌ను ఏ–1 కో ఆర్డినేటర్లు 2025 జనవరి 11వ తేదీ డీఈవో కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఎవరైనా పరీక్షల ఫీజులు అధికంగా వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


కౌన్సెలింగ్‌కు హాజరు కండి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని నగరపాలక, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తూ అర్హులైన ఎస్జీటీలు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని నగరపాలక, మున్సిపల్ పాఠశాలల్లోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు తెలిపారు. సబ్జెక్టుల వారీగా 1:3 నిష్పత్తి ప్రకారం కేడర్ల వారీగా సీనియారిటీ జాబితాలను డీవైఈవో, ఎంఈవోలకు పంపినట్లు చెప్పారు. ఆ జాబితా ప్రకారం అర్హులైన ఎస్జీటీలు సంబంధిత సర్టిఫికెట్, సర్వీస్ రిజిస్టర్లతో ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. చిత్తూరు డీఈవో కార్యాలయంలో సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ గణితం (తెలుగు మీడియం) 01, ఫిజికల్ సైన్స్ (తెలుగు) 01, కార్పొరేషన్ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 04, గణితం (తెలుగు) 01, ఫిజిక్స్ (తెలుగు) 01, బయాలజీ (తెలుగు) 07, సోషల్ (తెలుగు) 10, ఫిజికల్ డైరెక్టర్ 01 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించిన ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు డీఈవో వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 72,411 మంది స్వామివారిని దర్శించుకోగా, 27,677 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.44 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో స్మగ్లింగ్, మట్కా మాఫియా కోరలు చాచింది. పుత్తూరును కేంద్రంగా చేసుకొని అక్రమార్కుల ముఠా చెలరేగిపోతోంది. రేషన్ బియ్యాన్ని వివిధ రూపాల్లో సేకరించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తోంది. దీంతోపాటు గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తోంది. వేల సంఖ్యలో ఉన్న విద్యార్థులే లక్ష్యంగా మత్తు వ్యాపారంపై దృష్టి పెట్టింది. మట్కా ఆటతో పేదలకు ఆశ చూపి వారి సొమ్మును కొల్లగొడుతోంది. పోలీసులు చిన్నా చితకా వారిని పట్టుకుని స్టేషన్ బెయిల్ కేసులతో సరిపెడుతున్నారు. అయితే వెనక నుంచి నడిపిస్తున్న పెద్దల జోలికి పోవడం లేదు.



మాఫియా కూటమి

- పక్క రాష్ట్రాలకు తరలుతున్న రేషన్ బియ్యం
- యథేచ్ఛగా గంజాయి రవాణా
- పుత్తూరు కేంద్రంగా స్మగ్లింగ్
- ప్రేక్షక పాత్రలో పోలీసులు



పోలీస్ కంట్రోల్ రూమ్ వద్దే ఆటోలో బియ్యం (ఫైల్)

పుత్తూరు: కూటమి ప్రభుత్వం వచ్చాక పుత్తూరులో అక్రమాలకు హద్దే లేకుండా పోతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి అమ్మకాలు, మట్కా జూదం వంటి పలు అక్రమ వ్యాపారాలకు పుత్తూరు అడ్డాగా నిలుస్తోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో స్తబ్దుగా ఉన్న స్మగ్లర్లు ప్రభుత్వం మారడంతో మళ్లీ తెరపైకి వచ్చారు. దీంతో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. కొంత మంది రేషన్ డీలర్లే అక్రమాలకు పాల్పడుతున్నారు. అక్రమంగా సేకరించిన బియ్యాన్ని నగరి, నాగలాపురంలోని స్టాక్ పాయింట్లకు ఆటోలు, వ్యాన్ల ద్వారా పట్ట పగలే చేరవేస్తున్నారు. రాత్రి వేళ లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలించి లక్షలు ఆర్జిస్తున్నారు.



పుత్తూరులో లారీతో సహా పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

పుత్తూరు సివిల్ సప్లయ్స్ గోడౌన్ సీఎస్‌డీటీ విష్ణు రూ.2.05 కోట్ల విలువ చేసే 223 టన్నుల బియ్యాన్ని అక్రమంగా విక్రయించిన విషయం గత అక్టోబర్‌లో నిర్వహించిన తనిఖీల్లో బయటపడింది. తిరుపతి జిల్లా సీఎస్ మేనేజర్ సుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో తొలి ముద్దాయి సి.హెచ్.విష్ణును మాత్రం గత నవంబర్ 5న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసుకు సంబంధించి మరో నలుగురిని విచారిస్తున్నామని చెప్పిన పోలీసులు వీరిలో ఏ ఒక్కరినీ నేటి వరకు అరెస్ట్ చేయక పోవడం గమనార్హం.

దీని పర్యవసానంగా ఈ నెల 3వ తేదీన స్థానిక కాపువీధిలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉన్న 2,250 కేజీల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు బాధ్యులైన లక్ష్మీ, చిన్న, అమృతరాజ్‌పై స్టేషన్ బెయిల్ కేసులు పెట్టి వదిలిపెట్టారు. ఈ విషయాన్ని పోలీసులు మీడియాకు వెల్లడించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయినా పుత్తూరును కేంద్రంగా చేసుకొని నగరికి చెందిన బడా వ్యాపారులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నెల 16న పుత్తూరు పరిధిలోనే రూ.8.62 లక్షలు విలువ చేసే 19 టన్నుల బియ్యాన్ని ఎస్పీ స్పెషల్ ఫోర్స్ పోలీసులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం.

మట్కా రోజువారీ ఆట

దినసరి కూలీలు, ఆటో డ్రైవర్లు, పవర్ లూమ్స్ కార్మికులు, చిరు వ్యాపారులే లక్ష్యంగా పుత్తూరులో ప్రతి రోజూ మట్కా ఆటను జోరుగా ఆడిస్తున్నారు. చెన్నై కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ మట్కా ఆట స్థానిక ధర్మరాజుల ఆలయం, గేట్‌పుత్తూరులోని మసీదు, రైల్వే క్యాబిన్ ప్రాంతాల్లో యథేచ్ఛగా సాగుతోంది. ఈరోజు ఒక నంబర్‌పై ఒక రూపాయి కడితే మరుసటి రోజు ఆ నంబర్ వస్తే రూ.70 ఇస్తామని ఆశచూపి వేలాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో ఏజెంట్ల పని మరింత సులభంగా తయారైంది. ఎవరు ఏ నంబర్‌పై ఎంత నగదు కాస్తున్నారో అంత మొత్తాన్ని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఇక్కడి ఏజెంట్లు వసూలు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ సౌకర్యం లేని వారు నేరుగానే నగదును అంజేస్తున్నారు. ఇలా సేకరించిన నగదు, ఇతర వివరాలను ఇక్కడి ఏజెంట్లు ప్రధాన స్థావరమైన చెన్నైకి చేరవేస్తారు. ఇలా పనిచేసినందుకు ఏజెంట్లు వందకు ఇంత అని కమీషన్లు తీసుకుంటున్నారు. అధిక లాభాలకు ఆశపడి రోజంతా కష్టపడిన సొమ్మును ఇలా మట్కా ఆటలో దారపోస్తున్న వారు ఒక్క పుత్తూరులోనే వందల సంఖ్యలో ఉన్నారు. కళ్ల ముందే గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న ఈ మట్కాను ఆటకట్టించే విధంగా పోలీసులు పనిచేయకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మట్కా ఆడుతున్న దినసరి కూలీలు

విద్యార్థులే లక్ష్యంగా మత్తు!

పుత్తూరు పట్టణం విద్యాలయాలకు నిలయంగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పట్టణంలోని పలు హాస్టళ్లలో ఉంటున్నారు. అడిగే పెద్దరికం లేకపోవడంతో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. ఇదే అవకాశంగా గంజాయి స్మగ్లర్లు విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని తమ కార్యకలాపాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గంజాయి విక్రయిస్తూ ఏజెంట్లు పోలీసులకు పట్టుబడుతున్నా, అసలు స్మగ్లర్లు తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో ఇటీవల పోలీసు శాఖ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించింది. ఒకసారి మత్తుకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారమే అంటూ విద్యార్థులచే ర్యాలీలు చేశారు. అవగాహన కోసం ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అయినా ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలు, హాస్టళ్ల వద్ద గంజాయి అమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి.



పట్టుబడిన గంజాయి విక్రేతలు (ఫైల్)

ఉక్కుపాదంతో అణచివేస్తాం



“బియ్యం, గంజాయి, మట్కా వంటి అక్రమాలకు పాల్పడే వారిని ఇటీవల కాలంలో అరెస్టులు చేశాం. ఇక ముందు కూడా ఉక్కుపాదంతో అణచివేస్తాం. గంజాయిని అరికట్టడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. రేషన్ బియ్యం స్మగ్లింగ్ ప్రధానంగా నగరి కేంద్రంగా జరుగుతోంది. పుత్తూరులో అడుగుపెడితే అరెస్టులు తప్పవు. మట్కా ఆడించేవారిని ఇటీవల అరెస్ట్ చేశాం. దానిని పూర్తిగా రూపుమాపుతాం.

– జి.రవికుమార్, డీఎస్పీ, పుత్తూరు

హెచ్‌ఎంలుగా నలుగురు స్కూల్ అసిస్టెంట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎంతోకాలం నుంచి ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి లభించింది. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ఆదివారం నగర పాలక సంస్థ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగింది. ఈ కౌన్సెలింగ్‌కు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలోని నగరపాలక, మున్సిపల్ పాఠశాలల టీచర్లు హాజరయ్యారు. సీనియారిటీ జాబితాల ప్రకారం మొదట అర్హులైన టీచర్ల సర్వీస్ రిజిస్టర్లు, సర్టిఫికెట్లను ఎంఈవోలు రమేష్, ప్రసాద్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి ఖాళీల ప్రకారం నలుగురు స్కూల్ అసిస్టెంట్లకు హెడ్‌మాస్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అనంతరం డీఈవో వరలక్ష్మి సంబంధిత స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయం ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు వీజీ రమణ, సీనియర్ అసిస్టెంట్‌లు మురళి, గోపాల్, సాయి పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతుల ప్రక్రియలో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఎంఈవోలు

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడకు వచ్చి బాధితులు ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని ఎస్పీ వివరించారు.

నకిలీ విత్తనాలతో పంట నష్టం





పొలంలో వదిలేసిన టమాట (ఇన్‌సెట్) రైతు పెద్దబ్బ

- నేల రాలుతున్న టమాట
- లబోదిబోమంటున్న రైతు

రొంపిచెర్ల: నకిలీ విత్తనాలుతో టమాట పంట సాగు చేస్తే పంట పూర్తిగా దెబ్బ తిందని రైతు వాపోయాడు. బాధిత రైతు కథనం మేరకు, మండలంలోని గానుగచింత పంచాయతీ చల్లెంపల్లె గొల్లపల్లెకు చెందిన పెద్దబ్బ 1.5 ఎకరాలలో టమాట పంట సాగుచేశారు. రొంపిచెర్ల క్రాస్ రోడ్డులోని నర్సరీలో సాలార్ రకం టమాట మొక్క 90 పైసలు చొప్పున కొనుగోలు చేసి నాటారు. పంట సాగుకు సుమారు రూ.2 లక్షల ఖర్చు చేశారు. అయితే పంట దిగుబడి బాగానే వస్తున్నప్పటికీ కాయలు అన్నీ పిందె దశలోనే నేలరాలి పోతున్నాయని తెలిపారు. టమాట కాయలు రంగు కూడా సరిగా రావడం లేదన్నారు. మార్కెట్లో టమాటాల కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదని బోరున విలపించారు. రెండు లక్షలు ఖర్చు చేస్తే కనీసం రూ.5 వేలు కూడా రావడం లేదన్నారు. దీనికి కారణం నకిలీ విత్తనాలేనని ఆరోపించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో కలిపి లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. నర్సరీ వ్యాపారీని నిలదీస్తే మేము ఇచ్చిన విత్తనం మంచివేనని సమాధానం ఇచ్చాడని అన్నారు. వ్యవసాయాధికారులు పంటను పరిశీలించారు. తనకు న్యాయం చేయాలని రైతు కోరారు.

నర్సరీల్లో కానరాని తనిఖీలు

మండలంలో నర్సరీలు రోజుకొకటి పుట్టుకొస్తున్నాయి. వ్యవసాయ అధికారులు నర్సరీల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అనుమతులు ఇచ్చిన తర్వాత నర్సరీల్లో విత్తనాలను, నారును వ్యవసాయాధికారులు పరిశీలించి అమ్మకాలు చేపట్టాలి. అయితే అధికారులు నర్సరీల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రజలపై భూ బాదుడు

- ధరల పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం
- నూతన సంవత్సరంలో భూ ధరల పెంపు
- సగటున 10–20 శాతం అధికం
- రియల్ ఎస్టేట్ రంగానికి దెబ్బ



చిత్తూరు కార్పొరేషన్: అధికారంలో రాగానే ఏదో ఒక నెపంతో ధరలు, చార్జీలు పెంచడం కూటమి ప్రభుత్వం అలవాటుగా చేసుకుంది. ఇప్పటికే నిత్య వసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకాయి. నిన్న విద్యుత్ చార్జీలను పెంచగా నేడు భూముల ధరలను పెంచుతోంది. ఈ సారి భూముల ధరలకు రెక్కలకు వచ్చేస్తున్నాయి. ప్రజల నెత్తిన కూటమి ప్రభుత్వం భారం మోపేందుకు రంగం సిద్ధం చేసింది. జనవరి 1 నుంచి పెంచిన భూ విలువలు అమలవుతాయి. అసలే రియల్ ఎస్టేట్ సంక్షోభంలో ఉన్న తరుణంలో ఇలా భూమి విలువ పెంచడం వల్ల ప్లాట్‌లు కొనే నాథుడే ఉండడని ఆ రంగంపై ఆధారపడిన వారు ఆందోళన చెందుతున్నారు. విలువ పెంపు ప్రక్రియను పూర్తి చేశారు. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ప్రతిపాదిత విలువను జేసీ ఆమోదించారు. ప్రదర్శన, అభ్యంతరాల స్వీకరణ తర్వాత ఆమోదించనున్నారు. జిల్లాలోని 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరంగా సగటున 10–20 శాతం ధరలు పెరగనుండగా వాణిజ్య ప్రాంతాల్లో మరింత పెంచనున్నారు.

రియల్ వ్యాపారానికి భారీ దెబ్బ

కార్పొరేషన్, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీ వారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాల విలువనూ పెంచనుంది. పట్టణాల్లోని అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువ రూ.500–రూ.1000 వరకు పెరగనుంది. ప్రాంతాల వారీగా స్థలం విలువను బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముక్కుతూ మూలుగుతూ నడుస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రిజిస్ట్రేషన్ల చార్జీల పెంపు గొడ్డలిపెట్టుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఉన్న భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల మార్కెట్ విలువతో వ్యాపారాలు పడిపోయాయి. ఈ సమయంలో భూములు విలువను పెంచితే రియల్ రంగం దెబ్బతింటుందని వ్యాపారులు భావిస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో మరో నాలుగైదేళ్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోలుకోలేని పరిస్థితి ఎదురవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.



రియల్ వెంచర్‌లోని ప్లాట్లు

నూతన సంవత్సరం నుంచి భారం

పెంచిన మార్కెట్ విలువను ప్రభుత్వం నూతన సంవత్సరం కానుకగా ప్రజలపై భారం మోపనుంది. ప్రతిపాదిత విలువలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. వాటిపై ఈ నెల 24వ తేదీ వరకు ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించనున్నారు. వచ్చిన అభ్యంతరాలను 26లోపు పరిష్కరించి, 27న ప్రక్రియను ముగించనున్నారు. 2025 జనవరి 1 నుంచి కొత్త విలువల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. జిల్లాలో భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల విలువలు అమాంతం పెరగనుంది. ఇప్పటికే భూముల విలువ ఎక్కువగా ఉందనుకునే ప్రాంతాల్లో 15 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని, భూముల విలువ తక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 20 శాతం వరకు పెంచాలని అధికారులు ప్రతిపాదించారు.

ప్రతిపాదనలు ఇలా

- చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో బజారువీధి, ఓటీకేరోడ్డు, గురునాథ థియేటర్ రోడ్డులో చదరపు గజం విలువ ప్రస్తుతం రూ.45,100 ఉండగా వాటిని రూ.49,600కు ప్రతిపాదించారు.
- చిత్తూరు రూరల్ దిగువమాసపల్లెలో చదరపు గజం రూ.480 కాగా వాటిని రూ.550కు, గుడిపాల, యాదమరిలో రూ.1100 నుంచి రూ.1300కు పెంచనున్నారు.
- చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కాణిపాకం, జీడీనెల్లూరు, ముత్తిరేవుల ప్రాంతంలో చదరపు అడుగు రూ.2000 నుంచి రూ.2200కు, పలమనేరు పరిధిలోని జౌళివీధి, గంగమ్మగుడివీధి, బజారువీధి, జిలానివీధి, లింగయత్‌వీధి, ఎంబీటీరోడ్డులో చదరపు గజం రూ.15,000 నుంచి రూ.17,300కు ప్రతిపాదించారు.
- పుంగనూరు పరిధిలో పుంగనూరు టౌన్, మహబూబ్‌నగర్, గాజులవీధి, హనుమంతరాయవీధి, గంగమ్మగుడివీధుల్లో రూ.1,950 నుంచి రూ.2,250కు పెంచనున్నారు.
- కుప్పం పరిధిలో గుడుపల్లెరోడ్డు, నేతాజీరోడ్డు, టీబీరోడ్డు, ప్రకాశంరోడ్డు, రామచంద్రారోడ్డు, సోమయ్యవీధిలో రూ.13,800 నుంచి రూ.15,800కి పెంచేలా ప్రతిపాదించారు.
- పిచ్చాటూరు పరిధిలోని కార్వేటినగరంలో చదరపు గజం రూ.10,500 నుంచి రూ.12,080 కానుంది. నగరి పరిధిలో పళ్లిపట్టురోడ్డు చదరపు గజం రూ.14,000 కాగా రూ.16,800 పెరిగిపోనుంది.
- చిత్తూరు పరిధిలో దిగువమాసపల్లె, గుడిపాల, యాదమరిలో రూ.20 లక్షల ఎకరాను రూ.23 లక్షలు, పలమనేరు, నాగమంగళంలో రూ.12 లక్షల నుంచి రూ.13.80 లక్షలకు భూ విలువలను పెంచనున్నారు.
- కుప్పంలో రూ.2 లక్షల నుంచి రూ.2.30 లక్షలు, పుంగనూరు, చౌడేపల్లె, రాగనిపల్లెలో రూ.13 లక్షల నుంచి రూ.15 లక్షలకు సవరించనున్నారు.
- కార్వేటినగరంలో రూ.10.97 లక్షల నుంచి రూ.12.66లక్షలకు, ఎస్ఆర్‌పురంలో రూ.10.72 లక్షల నుంచి రూ.12.33 లక్షలకు పెంచేలా ప్రతిపాదనలు రూపొందించారు. నగరిలో రూ.7.26 లక్షల నుంచి రూ.8.71 లక్షలకు పెంచనున్నారు.

క్లుప్తంగా

వరదరాజుల స్వామికి వెండి ఆభరణాల కానుక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజస్వామికి ఓ దాత వెండి ఆభరణాలను విరాళంగా అందజేశారు. బెంగళూరుకు చెందిన నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులు సుమారు రూ.1.85 లక్షలు విలువ చేసే (1.8 కేజీల) వెండి హస్తాలు, పాదాలు విరాళంగా ఇచ్చారు. అనంతరం వారికి ఈవో పెంచల కిషోర్ ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

బోయకొండ కిటకిట


ఆలయంలో కిక్కిరిసిన క్యూలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరగడంతో క్యూలన్నీ నిండి కిటకిటలాడాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా సీఐ రామ్‌భూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

నగలు, నగదు చోరీ

పుంగనూరు: పట్టణంలోని మహబూబ్‌నగర్‌లో నివాసం ఉన్న నారాయణమూర్తి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు సమీప బంధువులు తెలిపారు. నారాయణమూర్తి పది రోజుల క్రితం తన కుమార్తె వైజాగ్‌లో ఉండడంతో అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. ఆదివారం నారాయణమూర్తి ఇంటిని అతని సమీప బంధువులు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలో ఉన్న నగలు, నగదు, వెండి దొంగిలించుకెళ్లినట్లు నారాయణమూర్తి సమీప బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి స్పెల్‌బీ పరీక్షకు మూడు జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు





సాక్షి స్పెల్‌బీకి అపూర్వ స్పందన

- మూడు జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు
- ఆంగ్లంలో రాణించేందుకు స్పెల్‌బీ సరైన వేదిక
- థ్యాంక్స్ టు సాక్షి అంటున్న విద్యార్థులు

నాలుగు కేటగిరీల్లో సాక్షి స్పెల్‌బీ సెమీఫైనల్ పరీక్ష

కేటగిరి – 1	:	1, 2వ తరగతులు
కేటగిరి – 2	:	3, 4వ తరగతులు
కేటగిరి – 3	:	5, 6, 7వ తరగతులు
కేటగిరి – 4	:	8, 9, 10వ తరగతులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడం తప్పనిసరిగా మారింది. ఉన్నత విద్య అయినా.. ఉన్నత కొలువులైనా పొందాలంటే ఆంగ్లంలో ప్రావీణ్యం తప్పనిసరి. ఆంగ్ల భాషపై పట్టు, నైపుణ్యం, సామర్థ్యం.. ఒడిసి పట్టుకుంటేనే నేటి తరం విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారు. దీనిని గుర్తించే ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో అవగాహన కల్పించి.. వారిలో నైపుణ్యం, ఆసక్తిని పెంపొందించేందుకు ఏటా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తూ.. వారిలో దాగున్న ప్రతిభకు పదును పెడుతోంది. ఇందులో భాగంగానే పాఠశాల స్థాయి, క్వార్టర్, సెమీఫైనల్, ఫైనల్ నాలుగు దశల్లో స్పెల్‌బీ నిర్వహిస్తోంది. ఫైనల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వేఫి, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తోంది. ఏటా సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలకు పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఎప్పటిలానే ఈ ఏడాది సైతం విద్యార్థులు ఈ పరీక్షకు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకుంటున్నారు.

సెమీఫైనల్‌కు మూడు జిల్లాల నుంచి..

తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూల్లో ఆదివారం సాక్షి స్పెల్‌బీ సెమీఫైనల్ పరీక్ష నిర్వహించారు. ఇదివరకు జిల్లాస్థాయిలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ (రెండవ రౌండు)లో ప్రతిభ చాటిన విద్యార్థులకు రీజనల్ స్థాయిలో సెమీఫైనల్ నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన 1 నుంచి పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు కేటగిరీల్లో ఈ పరీక్షను లైవ్ ద్వారా నిర్వహించారు. ఇందులో సత్తా చాటిన విద్యార్థులు ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు.

విద్యార్థులకు సరైన వేదిక స్పెల్‌బీ..

ఆధునిక యుగంలో విద్యార్థులు రాణించాలంటే ఆంగ్లం తప్పనిసరంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అన్నారు. ఈ ఆవశ్యకతను గుర్తించిన సాక్షి యాజమాన్యం ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంగ్ల భాషపై ప్రావీణ్యం సాధించేందుకు సరైన వేదిక సాక్షి స్పెల్‌బీ అన్నారు. ఉన్నత చదువుకు, ఆహ్లాదకరమైన పోటీతత్వం పెంపొందడానికి ఏటా సాక్షి మీడియా గ్రూప్ నిర్వహిస్తున్న స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ వంటి పరీక్షల్లో తమ పిల్లలను ప్రోత్సహిస్తే వారు ఉన్నతంగా రాణించేందుకు చక్కని అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

ఆత్మవిశ్వాసం రెట్టింపు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు ఇంగ్లిష్ భాష తప్పనిసరి. సామాజిక బాధ్యతతో పాటు విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసేలా సాక్షి సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయం. స్పెల్‌బీ ద్వారా విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం సాధించగలుగుతారు. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపై చదువులో ఉన్నతంగా రాణించగలుగుతారు.

– ఎన్.విశ్వచందన్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్, విశ్వం హైస్కూల్, తిరుపతి

ఇంగ్లిష్‌పై ఆసక్తి..



గత ఏడాది స్పెల్‌బీ పరీక్షలో రెండో రౌండు వరకు వచ్చా. దీంతో ఇంగ్లిష్‌పై మరింత ఆసక్తి పెంచుకుని బాగా సిద్ధమయ్యా. ఈ ఏడాది సెమీ ఫైనల్‌కు చేరుకున్నా. స్పెల్‌బీ పరీక్ష ద్వారా కొత్తకొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ తెలుసుకున్నా. వాటితో పాటు ఆ పదాలను ఎలా ఉచ్చరించాలనే విషయాలను మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ సెమీఫైనల్ పరీక్షను బాగా రాశాను. ఫైనల్‌కు చేరుకుంటాననే నమ్మకం ఉంది.

– బి.సాయిసాన్వి, 4వ తరగతి, నాగార్జున మోడల్ స్కూల్, కడప

మొదటి మారు పాల్గొన్నా..



స్పెల్‌బీ పరీక్షకు మొదటిసారి ఈ ఏడాది పాల్గొంటున్నా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని ఇంగ్లిష్ పదాలను బాగా సాధన చేశాను. పాఠశాల, క్వార్టర్ ఫైనల్ స్థాయిలో ప్రతిభ కనబరచి సెమీ ఫైనల్‌కు చేరుకోవడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ ద్వారా నాలో ఇంగ్లిష్ భాషపై ఆసక్తి పెరిగింది. కొత్తకొత్త పదాలు తెలుసుకోవడంతో ఆ భాషపై పట్టు సాధించగలిగాను. థ్యాంక్స్ టు సాక్షి.

– వై.శామ్యూల్ నోయెల్, 7వ తరగతి, ఓవెల్ మోడ్రన్ స్కూల్, కడప

ఫస్ట్ ప్రైజే లక్ష్యం



నాకు ఇంగ్లిష్ అంటే చాలా ఇష్టం. అందుకే సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీలో ఆరోసారి పాల్గొన్నాను. రెండేళ్ల క్రితం ఫైనల్‌కు చేరుకున్నా. గత ఏడాది ఫైనల్‌లో మూడో స్థానం సాధించాను. ఈ ఏడాది ఫైనల్‌లో ఫస్ట్ ప్రైజ్ సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నా. అందుకు తగ్గట్టుగా బాగా ప్రిపేర్ అయ్యాను.

– కె.జ్యోతిష, 10వ తరగతి, సంసిద్ కేంఫోర్డ్(ఈస్ట్) స్కూల్, చిత్తూరు

సామర్థ్యం పెరిగింది



స్పెల్‌బీలో పాల్గొనడం ఇది మూడో మారు. ఇంగ్లిష్ భాషలో నాకు సామర్థ్యం పెరగడానికి స్పెల్‌బీ దోహదపడింది. అనేక కొత్త పదాలు తెలుసుకున్నా. ఈ స్పెల్‌బీ పరీక్ష ద్వారా ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెరిగింది. ఇంగ్లిష్‌లో సరళంగా, తప్పులు లేకుండా మాట్లేడేందుకు స్పెల్‌బీ దోహదపడి నాలో ఆత్మవిశ్వాస్ని పెంచింది.

– గౌరవ్‌కుమార్ రాయ్, 9వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుపతి

ఫైనల్‌కు వెళ్లడమే లక్ష్యం



గత ఏడాది స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరుకున్నాను. ఈ ఏడాది సెమీ ఫైనల్స్‌కు చేరుకోవడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ మెటీరియల్‌లోని అన్ని పదాలను బాగా సాధన చేశాను. కొత్త పదాల స్పెల్లింగ్, ఉచ్చారణ మా టీచర్‌ను అడిగి తెలుసుకున్నాను. ఈ ఏడాది సెమీఫైనల్‌లో రాణించి ఫైనల్‌కు చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రిపేర్ అయ్యాను.

– సీహెచ్ షక్రుత్, 7వ తరగతి, సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్, నెల్లూరు

పోటీ పరీక్షలకు ఉపయోగం



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ ద్వారా ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించవచ్చు. స్పెల్‌బీ మెటీరియల్‌లోని పదాలు చాలా వరకు కొత్తవి. ఆ పదాలను ఎలా పలకాలి, వాటి స్పెల్లింగ్, అర్థం తెలుసుకున్నాను. 2022లో సెమీ ఫైనల్ వరకు చేరుకున్నాను. తిరిగి ఈ ఏడాది సెమీఫైనల్‌కు వచ్చాను. ఈ స్పెల్‌బీ ద్వారా ఇంగ్లిష్ నాలెడ్జ్ పెరిగింది.

– జె.సాయిచేతన్, 7వ తరగతి, రెయిన్‌బో స్కూల్, నెల్లూరు

కొత్త పదాలు నేర్చుకుందాం



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షను మొదటిసారి రాస్తున్నా. మొదటి రెండు రౌండ్లో నెగ్గి ఇప్పుడు సెమీ ఫైనల్ దాకా వచ్చా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని ఇంగ్లిష్ పదాలు చాలావరకు కొత్తవి. ఆ పదాలను ఎలా ఉచ్చరించాలి? వాటి స్పెల్లింగ్స్, అర్థాలను మా టీచర్‌ను అడిగి తెలుసుకున్నాను. స్పెల్‌బీకి ప్రాక్టీస్ చేసే కొద్దీ నాలో ఇంగ్లిష్‌పై ఆసక్తి రెట్టింపైంది. థ్యాంక్స్ టు సాక్షి.

– డి.పోసిన్యాశ్రీ, 5వ తరగతి, లిటిల్ ఏంజెల్స్ స్కూల్, తిరుపతి

ద్రవిడ వర్సిటీలో ఉద్యోగినికి వేధింపులు


బాధితురాలు భాగ్యలక్ష్మి

కుప్పం: 'నువ్వు అటెండర్‌గా పనికిరావు..స్వీపర్‌గా, తోటమాలిగా పనిచేసుకో' అంటూ రిజిస్ట్రార్ వేధిస్తున్నారని బాధితురాలు మీడియాతో ఆదివారం వాపోయింది. బాధితురాలి కథనం మేరకు, 2007లో ద్రవిడ వర్సిటీలో భాగ్యలక్ష్మి అటెండర్‌గా చేరారు. అప్పటి నుంచి వివిధ విభాగాల్లో అటెండర్‌గా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. గతంలో వర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు సక్రమంగా ఇవ్వలేదని ఉద్యోగులు ధర్నాలు చేపట్టారు. అప్పట్లో భాగ్యలక్ష్మి అనారోగ్యం కారణంగా ఆ ధర్నాలకు హాజరు కాలేదు. దీంతో ఆమెపై యూనియన్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. అంతేకాకుండా ధర్నాకు రాలేదని తమిళ విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో భాగ్యలక్ష్మిపై దాడి చేయించి గాయపరిచారు. దీనిపై అప్పట్లో గుడుపల్లె పోలీస్ స్టేషన్‌లో భాగ్యలక్ష్మి ఇచ్చినా ఫిర్యాదు మేరకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును వాపసు తీసుకోవాలని వర్సిటీ అధికారులు వేధిస్తున్నారని, చెప్పినట్లు వినకపోతే అటెండర్ నుంచి స్వీపర్‌గా మార్చుతామని బెదిరిస్తున్నట్లు ఆమె వాపోయారు. దీంతో పాటు తన భర్త గుండె నొప్పితో బాధపడుతున్నారని, ఈ విషయం వర్సిటీ అధికారులకు తెలిసినా మరింత ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు.ఈ మేరకు వర్సిటీ మహిళా విభాగానికి ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో ఆదివారం జిల్లా కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపికకు పోటీలను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ ప్రాంతాల క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా బాలికల జట్టులో 12మంది క్రీడాకారులు, మరో ఇద్దరు స్టాండ్‌బైలు, బాలుర జట్టులో 12మందితోపాటు మరో ఐదుగురు స్టాండ్‌బైలను ఎంపిక చేసినట్లు చెప్పారు. జనవరి 3 నుంచి కర్నూలులో నిర్వహించనున్న 50వ బాలబాలికల అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో ఈ జట్లు పాల్గొంటాయని అధ్యక్ష, కార్యదర్శులు తెలియజేశారు.

జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలు: పూజిత, నేత్ర, శాలిని, అన్షిత, సుస్మిత, రాజాద్రి, లిఖిత, లోహిత, నక్షత్ర, మంజుల, నాగేశ్వరి, అనూష, హిందూ, శ్రీజ ఎంపికయ్యారు

బాలుర జట్టు: గణేష్ శివ అనిల్, భార్గవ్, కార్తీక్, శరత్, సల్మాన్ విక్రమ్, అన్నాదొర, విజయ్, అలెక్స్, మేరీమోక్షి, చిరంజీవి, మహేష్, లోకేష్ యుగంధర్, రాజు, హుస్సేన్, రవి, క్యాథిస్.

అధికారం అడ్డు పెట్టుకుని ఆక్రమణ

- మేత భూమిలో పట్టాలా..?
- తమదే భూమి అంటూ కూటమి నేతల పోటాపోటీ
- ఓ వర్గం చదును చేస్తే.. మరో వర్గం మొక్కలు నాటుతున్న వైనం
- గ్రామస్తుల ఆగ్రహం


మేత భూమిని ఆక్రమించి కూటమి నేతలు నాటిన మొక్కలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నేతలు అధికారం అడ్డు పెట్టుకుని భూములను ఆక్రమించేస్తున్నారు. భూమి తమదేనంటూ ఆ పార్టీలోని ఇరువర్గాలు గట్టిగా పోటీపడుతున్నాయి. ఓ వర్గం భూమి చదును చేస్తే మరోవర్గం వెళ్లి మొక్కలు నాటింది. దీంతో వివాదం ముదిరి ఘర్షణకు దారితీస్తోంది. దీంతో చదును చేసిన వర్గం పోలీసుల ఆశ్రయించింది. చెట్లు నాటే కార్యక్రమాన్ని ఆపి రెవెన్యూ అధికారుల దగ్గరకు వెళ్లాలని ఇరువర్గాలకు పోలీసులు హుకుం జారీ చేశారు.

చిత్తూరు నగరం బండపల్లి రెవెన్యూ 194. వెంకటాపురం గ్రామ సమీపంలో 24 ఎకరాల మేత భూమి ఉంది. పశువుల మేత కోసం ఈ భూమిని కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం కేటాయించింది. పశువులు నీళ్లు తాగేందుకు అనువుగా ఇక్కడ 2002లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కుంటను ఏర్పాటు చేశారు. దీని చుట్టూ చదునుగా 20 ఎకరాల వరకు మేత భూమి ఉంది. దీనిపై కొంత మంది కన్ను పడింది. ఎలాగైనా పట్టా చేసుకోవాలని ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో కొంత మంది వ్యక్తులు పట్టా తీసుకున్నారని, దీనిపై రైతులు న్యాయస్థానం ఆశ్రయించడంతో మేతభూమిగా గుర్తించి ఆ పట్టాను రద్దు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై పలుమార్లు మీడియాలో కథనాలు రావడంతో అధికారులు కూడా పరిశీలించి ఆక్రమణలను అడ్డుకున్నారు.

వివాదం ఇలా..

పట్టా ఉందని చెప్పి మూడు రోజులుగా ఓ వర్గం ఆ మేత భూమిని చదును చేసింది. ఇది తెలిసిన గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో మరోవర్గం వచ్చి తమకు పట్టా ఉందని, చదును చేసే వారిని అడ్డుకుంది. ఇదే అదునుగా భావించి అడ్డుకున్న వర్గం ఆదివారం చెట్లు నాటేసింది. ఇది తెలిసిన మరోవర్గం పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పట్టాలు ఉంటే తీసుకుని రెవెన్యూ అధికారుల దగ్గరకు వెళ్లాలని చెప్పారు. దీంతో చెట్లు నాటే కార్యక్రమం అర్ధంతరంగా ఆగిపోయింది. సోమవారం తహసీల్దార్ ఎదుట పంచాయతీ పెట్టనున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇంతకీ పట్టాలు ఉన్నాయా..లేవా అనే విషయాలు ఈ పంచాయతీలో తేలనుంది.

మేతభూమికి పట్టాలు ఎలా?

ఇరువర్గాలకు 5 ఎకరాల చొప్పున పట్టాలు ఉన్నట్లు చెబుతున్నారని, అయితే మేత భూమికి ఎలా పట్టాలు ఇస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. 20 ఏళ్ల క్రితం ఇచ్చిన పట్టాను కూడా న్యాయస్థానం కొట్టివేసిందని చెబుతున్నారు. ఇన్నాళ్లు లేని ఈ పట్టాల గోల ఏమిటన్న అయోమయంలో ఉన్నారు. ఒకవేల ఇది నిజమైతే మళ్లీ కోర్టు మెట్లు ఎక్కాలిసందేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ లోకేశ్వరిని వివరణ కోరగా, విచారిస్తాం. ఆక్రమణలు ఉంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మీరు మహిళలా?

- సమావేశానికి మహిళలను సమీకరించకపోవడంతో టీడీపీ నాయకులపై నారా భువనేశ్వరి ఆగ్రహం


మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

వి.కోట : పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆదివారం ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటిశుద్ధి కేంద్రం రెండో సారి ప్రారంభానికి సీఎం సతీమణి నారా భువనేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె అంతా కుప్పం గురించే మాట్లాడడం మొదలు పెట్టారు. ఈ సమావేశానికి మహిళలను ఎందుకు సమీకరించలేదు.. అందరూ మగవారే వచ్చారు. మహిళలను తీసుకురావడంపై ఇంత అలసత్వమా అని మండిపడ్డారు. టీడీపీ నాయకులను చూసి 'మీరు మహిళలా..' అంటూ చురకలంటించారు. అంతేకాక సీఎం చంద్రబాబు కుప్పానికి చేసిన అభివృద్ధి పనులను వల్లె వేస్తూ కుప్పం జపం చేశారు. దీనికి మహిళలు అతి తక్కువ మంది హాజరయ్యారు. కుప్పం మహిళలకు ముఖ్యమంత్రి ఎంతగానో అండగా ఉన్నారంటూ ప్రసంగించారు. పలమనేరు నియోజకవర్గానికి చెందిన వి.కోటను కుప్పంలో భాగమైనట్లు మాట్లాడడంతో ప్రజల్లో అసంతృప్తి కనబడింది. ఆమె సభలో వి.కోటను మర్చిపోవడంపై నాయకులు లోలోన మధనపడడం గమనార్హం. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మహిళలను కార్యక్రమాలకు పిలిస్తే ఎలా వస్తారంటూ నాయకులు గుసగుసలాడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు ఈశ్వర్, ధీరజ్, శబరీష్, సతీష్ పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ గౌని చెర్వు వద్ద శనివారం రాత్రి ఏనుగులు వరిపంటలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన 8 మందికి చెందిన వరి పంట కుప్పలను ఏనుగులు తొక్కి వడ్లను తినేశాయని బాధితులు తెలిపారు. సుమారు రూ.లక్ష మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వెల్లడించారు. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని కోరుతున్నారు. ఏనుగుల ధాటికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం గుప్పెట్లో జీవిస్తున్నారు.